## క్లుప్తంగా

### ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం చెల్లించాలి

ముస్లిం మైనార్టీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇమామ్ హుస్సేన్



అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం ఇమామ్, మౌజన్లు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇమామ్ హుస్సేన్ ఒక ప్రకటనలో కోరారు. గత 11 నెలలుగా ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు లేవని వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నెల ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం చెల్లించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలను పట్టించుకోవడం లేదన్నారు. ఇమామ్‌లకు, మౌజన్‌లకు గౌరవ వేతనం పెంపుదల చేస్తామన్నారని, కానీ గౌరవ వేతనాలు కూడా చెల్లించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

### రక్తహీనతపై అంగన్‌వాడీలకు అవగాహన



అమర్తలూరు(వేమూరు): కిశోర బాలికలు రక్తహీనత పట్ల జాగ్రత్తలు పాటించాలని అమర్తలూరు సీడీపీవో ఎ.లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర బాలికల రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి కిశోర బాలికల్లో రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చలార్చిన నీరు తీసుకోవడం మంచిదన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంపై తల్లులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.నాంచారమ్మ, టి.విజయలక్ష్మి, అమర్తలూరు, చుండూరు సూపర్‌వైజర్ జి.శకుంతల, జి.లక్ష్మీపద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి



రైతు శ్రీధర్ మృతదేహం

నగరం: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని ఏలేటిపాలెం గ్రామంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఏలేటిపాలెం గ్రామానికి చెందిన వేమవరపు శ్రీధర్(46) రాత్రి సమయంలో వరి పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటిన వారు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు శ్రీధర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### అనిల్‌కుమార్‌కు నివాళి



వేమూరు: చుండూరు మండల కేంద్రంలో దళితులపై జరిగిన దాడులను వ్యతిరేకించిన అనిల్‌కుమార్ పోలీసులు కాల్పుల్లో మృతి చెందాడని దళిత న్యాయవాది కె.సి.బసవయ్య తెలిపారు. తెనాలి గంగానమ్మపేటలో అనిల్‌కుమార్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991లో చుండూరులో దళితులపై అగ్రవర్ణాల వారు దాడులు చేశారని, ఆ దాడులను వ్యతిరేకించిన అనిల్‌కుమార్‌ను పోలీసులు కాల్చి చంపారన్నారు. చుండూరు దాడుల్లో మృతి చెందిన అనిల్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రవి రాజా, కూకటిపల్లి వినోద్‌కుమార్, సురేష్, మాణిక్యరావు, మండే పీటర్, బడుగు రత్నకుమార్, దాసరి బాబు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

తెనాలి రూరల్: మండల పరిధిలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు బుధవారం బహుకరించారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తలతోటి సుభాషిణి తన భర్త జోసెఫ్ జ్ఞాపకార్థం 25 మంది క్రీడాకారులైన విద్యార్థులకు దుస్తులు బహుకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.అనురాధ తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛందంగా దాతలు సహకరించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టి.నోయల్, ప్రత్యక్ష పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిమాండ్ ఉన్నా.. దిగుబడి లేదు

- విలవిల్లాడుతున్న రొయ్యల రైతులు
- వాతావరణంలో మార్పులతో అవస్థలు
- పెరిగిన మేత, సాగు వ్యయం

బాపట్ల: వాతావరణ మార్పులు.. కరెంటు కోతలు.. పెరుగుతున్న మేత ధరలు.. తగ్గిన రొయ్యల ధరలు.. వెరసి ఆక్వారైతులు కుదేలవుతున్నారు. పెట్టుబడులు గణనీయంగా పెరిగినా ఆశించిన దిగుబడి రావటం లేదు. ధరలు పెరిగినప్పటికి దిగుబడి లేకపోవటంతో అల్లాడిపోతున్నారు. ఆశ, నిరాశల మధ్య ఆక్వారంగం ఉక్కిరి బిక్కిరి అయ్యే దుస్థితి నెలకొంది. బాపట్ల నియోజకవర్గంలో సుమారు 5 వేల ఎకరాలలో రొయ్యల సాగు జరుగుతుంది. ఇటీవల కాలంలో రొయ్యల సాగుకు మరింత డిమాండు పెరగడంతో వాటి కౌలు ధరలు ఎకరానికి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు వరకు పెరిగాయి. ప్రధానంగా కర్లపాలెం, పిట్టలవానిపాలెం, బాపట్ల మండలాల్లోని అల్లూరు, అలకాపురం, ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం, బుద్దాం, యాజలి, పెదపులుగువారిపాలెం, దేవినూతల తదితర గ్రామాల పరిధిలో ఆక్వా సాగును చేపట్టారు. నియోజకవర్గం నుంచి ఆక్వా సీడ్ ఉత్పత్తులు కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. రొయ్యల సాగుకు చెరువుల లీజులు పెరగడంతో పాటు మేత ధరలు కూడా పెరగడంతో దిగుబడి లేకపోవటంతో తీవ్రంగా నష్టపోతున్నారు.



రొయ్యల చెరువు

**రొయ్య రైతు విలవిల**

కష్టనష్టాలు, ఆటుపోట్లతో రొయ్యల రైతులు విలవిల్లాడుతున్నారు. 29 పైసలు ఉండే రొయ్య పిల్ల ధర ఏకంగా రూపాయి అయింది. ఎకరానికి లక్ష రొయ్య పిల్లలను వేసే దశలోనే పెట్టుబడి రెట్టింపయింది. దాదాపు నాలుగు నెలల పాటు కంటికి రెప్పలా రొయ్యల సాగు చేయడం రైతులకు కంటిమీద సాములా మారింది. ఇదే సమయంలో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ బ్యాలెన్సు కోసం ఎకరానికి కనీసం రెండు సెట్లు ఏరియేటర్లు తిప్పాల్సి ఉంటుంది. దీంతో రూ.25 వేలు పలికిన ఏరియేటర్ల ధర ఇప్పుడు రూ.50 వేలకు చేరింది. రొయ్యల మేత ధర టన్ను రూ.70 వేల నుంచి రూ.90 వేలు పలుకుతుంది. టన్ను రొయ్యల ఉత్పత్తికి టన్ను మేతను వేయాల్సి రావడంతో పెట్టుబడులు రాక ఆక్వా రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్యల రైతులు టన్ను రొయ్యల ఉత్పత్తికి రూ.40 వేల వరకు అదనపు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో తలకు మించిన భారం అవుతుంది. ఇంత చేసినా నష్టాల సాగు మాత్రమే మిగులుతుంది.

**వేధిస్తున్న లూజ్ షెల్ వ్యాధి**

వీటన్నింటికి తోడు ఆక్వా రైతులను లూజ్ షెల్ వ్యాధి వేధిస్తోంది. రొయ్యలు పది గ్రాముల బరువు వచ్చాక ఈ వ్యాధి సోకుతుంది. వెంటనే సీడ్ తెల్లగా వచ్చి చనిపోతుంది. ప్రస్తుతం హెక్టారు చెరువులో 4 లక్షల వరకు సీడ్ వేస్తున్నారు. చెరువులో వేసిన సీడ్ హార్వెస్టు సమయానికి సగానికి పడిపోతుంది. ఏకారణంగానైనా మధ్యలో చెరువు దెబ్బతింటే సర్వైవల్ సగానికి తగ్గిపోతుందని ఇదంతా కొంతమంది ఇచ్చే నాణ్యతలేని సీడ్ వల్లే జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

**కరెంటు కోతలతో నష్టాల వాత**

ఒక వైపు వాతావరణం.. మరో వైపు కరెంటు కోతలు రొయ్యల రైతులను నష్టాలకు గురి చేస్తున్నాయి. మారుతున్న వాతావరణంలో రొయ్యలకు ఆక్సిజన్ లోపం తలెత్తుతుంది. ఉక్కపోతతో ఊపిరాడక రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో ఏరియేటర్లు తిప్పేందుకు కరెంటు కోతలు ప్రధాన సమస్యగా మారాయి. ఆయిల్ ఇంజన్ల సాయంతో ఏరియేటర్లను తిప్పడం అదనపు భారంగా మారింది. మరోవైపు ఆక్సిజన్ అందక రొయ్యలు చనిపోయే ప్రమాదం రావడంతో మధ్యలోనే వాటిని పట్టుబడి పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేద్దామంటే అవి దెబ్బతినకుండా ప్యాకింగ్ చేసేందుకు ఐస్ కొరత వచ్చి పడింది. చెరువులు పట్టేందుకే భయపడుతున్నారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఆర్డీవో రామలక్ష్మి

చెరుకుపల్లి: మండలంలోని రైతులు యూరియా అందదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యూరియా అందరికి అందించటం జరుగుతుందని రేపల్లె ఆర్డీవో ఎస్.రామలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గూడవల్లి పీఏసీఎస్, చెరుకుపల్లి గ్రోమోర్‌లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేసి యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించి యూరియా సక్రమంగా అందుతుందా లేదా అని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ యూరియా సమృద్ధిగా సరఫరా జరుగుతుందని, మండలంలోని రైతులందరికీ అవసరం మేరకు అందించటం జరుగుతుందని, ఈ విషయాన్ని రైతులు గమనించి ఓర్పుగా వ్యవహరించాలని సూచించారు. గూడవల్లి పీఏసీఎస్‌లో 440 బస్తాలు, చెరుకుపల్లి గ్రోమోర్‌లో 440 బస్తాల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రైతులకు టోకెన్ల పద్ధతి ద్వారా నిష్పక్షపాతంగా పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు గానీ మరెవరైనా యూరియా అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తిస్తే అట్టి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గూడవల్లి సహకార సంఘంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

## యువత హమీద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రైల్వే బోర్డు మెంబర్ పఠాన్ రాజేష్

బాపట్లటౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనుడు అబ్దుల్ హమీద్ అని గుంటూరు రైల్వే బోర్డు మెంబర్ పఠాన్ రాజేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బాపట్ల ఎంపీ కార్యాలయం ఆవరణలో అమర సైనికుడు అబ్దుల్ హమీద్ 60వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ 1965లో భారత్–పాకిస్తాన్ యుద్ధంలో శత్రువులు ఆకస్మికంగా దాడి చేస్తే యుద్ధం జరిగే ప్రదేశంలో చెరుకుతోటలో దాక్కొని తన రికైల్నెస్ గన్‌తో ఒక్కడే పాకిస్తాన్‌కు చెందిన 8 యుద్ధ ట్యాంకులను పేల్చివేశారన్నారు. ఆ క్రమంలో పాకిస్తాన్ తుపాకీ గుళ్లకు బలై హమీద్ మృత్యువాత పడ్డారన్నారు. దేశం కోసం హమీద్ పోరాడిన విధానాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరమ వీర చక్ర బిరుదును ప్రకటించిందన్నారు. యువత హమీద్‌ను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో కె.కొండలు, జి.కొండలు, నర్రా ఏడుకొండలు, గవిని ప్రసాద్, గేరా చార్లెస్, డి.రాము, మోహన్, నక్కా ప్రకాష్ పాల్గొన్నారు.



అబ్దుల్ హమీద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న పఠాన్ రాజేష్

## పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



ఐలవరంలో వర్షపు నీటితో వరి పంట పొలాలు

### కాల్వల్లో పూడిక తీయాలని రైతుల ఆవేదన

భట్టిప్రోలు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో మురుగు, సాగు నీటి కాల్వలు అభివృద్ధి పనులు నీటి వినియోగదారుల సంఘాల ద్వారా చేపట్టినప్పటికి పూర్తి స్థాయిలో జరగకపోవడంతో పనులు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో భట్టిప్రోలు, అద్దేపల్లి, బాడవ పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు తరలించేందుకు కాల్వలకు అడ్డు పడిన చెట్లు, గుర్రపు డెక్క తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**కొద్దిపాటి వర్షానికే నిలిచిన నీరు**

మురుగు నీరు పారుదల మార్గం లేక రైతులు సాగు చేసిన పంట ప్రతి ఏటా మునిగి పాడైపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత కొన్నేళ్లుగా డెల్టా ప్రాంతంలో మురుగు కాల్వల పూడికతీత లేక కట్టలు బలహీన పడ్డాయి. కాల్వల్లో పెద్ద పెద్ద చెట్లు అడ్డుపడి మురుగు నీరు పారుదల కావడం లేదు. దీంతో వరి పంట నీట మునిగి దెబ్బతింటుంది. ఈ ఏడాది రైతులు అధిక శాతం వెద పద్ధతిన వరి సాగు చేశారు. సాగు చేసిన పంట ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు పొలాల్లో నీరు నిలిచిపోయింది. మరో మారు సాగు చేయడానికి కూడా అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

### వర్షపు నీటిని బయటకు పంపాలి



వెద పద్ధతిన సాగు చేసిన పంట పొలాల్లో వర్షపు నీటిని వెంటనే బయటకు పంపేలా చూడాలి. మొలక రాని గింజ ఐదు రోజుల వరకు నీటిలో ఉన్నప్పటికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఆ తరువాత నీటిలో నాని మురిగిపోయి మొలక శాతం తగ్గుతుంది.

– బి.బ్రహ్మారెడ్డి, ఏవో, భట్టిప్రోలు

## అండగా ఉంటూ.. బంగారం చోరీ

తెనాలిరూరల్: వృద్ధులకు అండగా ఉంటూ చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బుర్రిపాలెం రోడ్డు నాగయ్య వీధిలో శాఖమూరి గిరికుమారి, ఆమె భర్త నివసిస్తున్నారు. పిల్లలు అమెరికాలో ఉండడంతో వీరి బాగోగులు చూసేందుకు ఓ వ్యక్తిని పనిలో పెట్టారు. ఈ నెల 8న పనిచేసే వ్యక్తి ఇంట్లో ఉన్న 80 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించుకెళ్లాడు. భర్త దివ్యాంగుడవడం, వృద్ధురాలైన గిరికుమారి వెంటనే పోలీసులను ఆశ్రయించ లేదు. తెలిసిన వారి సాయంతో బుధవారం పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు రాత్రికి నమోదు చేశారు.

### బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ

వెల్లటూరు(భట్టిప్రోలు): తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) ధైర్య సాహసాలు అనిర్వచనీయమని పలువురు పేర్కొన్నారు. బుధవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక అని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చాకలి ఐలమ్మ సేవలు అజరామరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, నాయీబ్రాహ్మణ, రజక సంఘం నాయకులు మున్నంగి వెంకటేశ్వరరావు (శివమణి), సుబ్బారావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగులు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ తెనాలి నాయకులు డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్‌ను తన కార్యాలయంలో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగులందరు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోండి

ఐబీఎం సంస్థ ప్రతినిధి అశ్విని కుమార్



తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని ఐబీఎం సంస్థ ప్రతినిధి అశ్విని కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో బుధవారం స్కిల్ డెవలప్ మెంట్‌పై వర్క్ షాపును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ శాంత కుమారి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య, ఎపీఎస్ఎస్‌డీసీ అధికారులు ప్రసన్న కుమార్, మణికంఠ గోపాల్ పాల్గొన్నారు.

## వైకుంఠపురం దేవస్థానానికి రూ.లక్ష వితరణ

తెనాలి: చిన్నతిరుపతిగా పేరొందిన తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంకు తెనాలికి చెందిన చందు సత్యనారాయణ వరప్రసాద్–శివపార్వతి దంపతులు బుధవారం లక్ష రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి వి.అనుపమకు ఈ మొత్తాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికారమేష్, పాల్గొన్నారు. దాతల సహకారంతో వీటి నిర్మాణం చేసినట్టు ప్రధాన అర్చకుడు రత్నాకరం సత్యనారాయణగౌతమ్ తెలిపారు. కుమార్ పంప్స్ కొత్త సుబ్రహ్మణ్యం రూ.22 లక్షలతో షెడ్డు మొత్తం వేయించారని, దాతల సహకారంతో మిగిలిన పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. చివరగా ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ కోసం రూ.1.65 లక్షల బకాయిలుంటే, ప్రియదర్శిని కాలేజి రూ.లక్ష ఇవ్వగా, మిగిలిన 65 వేలు, వివిధ సందర్భాల్లో తమ పేరిట అన్నదానం చేసేందుకని మరో రూ.35 వేలు కలిపి తెనాలికి చెందిన చందు సత్యనారాయణవరప్రసాద్ –శివపార్వతి దంపతులు మొత్తం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. పూర్తిచేసిన షెడ్డులో పొంగలిశాల, కేశఖండనశాలతో క్యాటరింగ్, టెంట్ హౌస్‌కు కూడా అవకాశం కల్పించామని, పిల్లలు, మహిళలకు స్నానం గదులు కూడా నిర్మించినట్టు వివరించారు. అతిత్వరలో ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత

పొన్నపల్లి సత్యన్నారాయణ

చెరుకుపల్లి: హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుళ్ళపల్లి నూకాలమ్మ దేవస్థానం ఆవరణలో మండలంలోని ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక నిధులతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లో నిర్మించిన దేవాలయాల్లో అదే కులస్తులకు చెందిన వారికి అర్చకులుగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ ద్వారా శిక్షణ ఇప్పించటం జరిగిందని, వారే దేవాలయాల్లో అర్చకత్వం నిర్వహించి ధూప దీప నైవేద్యాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ అర్చకులు ఈ నెల 20వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారని, అందుకు గాను సన్నద్ధ సమావేశం నిర్వహించామని తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలను ఎస్ఎస్ఎఫ్ నెరవేరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, చింతల మురళీ కృష్ణ, జిల్లా దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొన్నపల్లి సత్యన్నారాయణ తదితరులు

## వరి దుబ్బు దశలో తగు యూరియా అందించాలి

ఏవో ఎండీ ఫారూఖ్

చెరుకుపల్లి: వరి పంట దుబ్బు దశలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూఖ్ తెలిపారు. బుధవారం మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట 40 నుంచి 50 రోజుల దశలో ఉన్నదని, దుబ్బు చేసే దశలో సాధారణంగా ముదురు ఆకుల చివర్లు లేత పసుపు రంగుకు మారటం, పంట ఎదగక పోవటం వంటి లక్షణాలు కనిపిస్తే దానిని నత్రజని లోపంగా గుర్తించి తగిన మోతాదులో యూరియా అందించాలని ఆయన రైతులకు సూచించారు. రెండవ దఫా ఎరువులు వేసే సమయంలో సంప్రదాయ యూరియాకు బదులుగా నానో యూరియాను ఎకరాకు అర లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తుమ్మలపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో షారూఖ్

## రైతు సేవా కేంద్రాల ద్వారానే యూరియా పంపిణీ చేస్తాం: ఏవో

సాక్షి ఎఫెక్ట్

వేమూరు: రైతు సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు సమక్షంలో యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ తెలిపారు. బుధవారం 'టీడీపీ నాయకుడి ఇంటి వద్ద యూరియా పంపిణీ' శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనంపై స్పందించిన ఏవో వివరణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వేమూరు మండలంలోని పెనుమర్రు రైతు సేవా కేంద్రం చాలా చిన్నదిగా ఉండటం వల్ల రాత్రి సమయంలో యూరియా లోడ్ రావడం.. లారీ తిరుగుటకు రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల గ్రామంలోని రోడ్డు పక్కన రోడ్డుకు దగ్గరగా ఉన్న ఇంటిలో లోడు దించడం జరిగిందని తెలిపారు. పెనుమర్రులోని వెటర్నరీ హాస్పటల్‌లో లోడ్ దింపాలని చూడగా ఆ బిల్డింగ్ కూడా సౌకర్యంగా లేకపోవడంతో రైతులతో సంప్రదించి వారి సూచనలు మేరకు రోడ్డు పక్కన ఉన్న ఇంటిలో యూరియాను దించడం జరిగిందన్నారు. మరుసటి రోజు ఉదయం రైతులకు స్లిప్పులు పంపిణీ చేసి అధికారుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేసామన్నారు. కోడిపర్రు గ్రామానికి చెందిన ఆనంద్ అనే రైతుకు ఇచ్చిన స్లిప్‌ని వేరే వ్యక్తులు చింపివేశారని, అతనికి మరలా స్లిప్ అందజేసి, ఎరువులు ఇవ్వడం జరిగిందని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అధికారుల పర్యవేక్షణలో మాత్రమే యూరియాని పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



మండలంలోని చంపాడు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి

తెనాలిఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావులు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని బుధవారం గాంధీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెలలో చత్తీస్‌గడ్‌లో జరిగే జాతీయ మహాసభలలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, తుంగ బాలస్వామి, పాశం వెంకటేష్, గండు శివ, బిళ్ల రాజేష్, గోపి, కోల శేఖర్, రవి, కోట్లు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల్యాద్రి

## రక్తకన్నీరు నాగభూషణం చిరస్మరణీయుడు

అమర కళాకారుల సంస్మరణలో లలితానంద ప్రసాద్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా బుధవారం సాయంత్రం రక్తకన్నీరు నాగభూషణం సంస్మరణ సభను నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో ఏర్పాటైన సభకు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రచయిత లలితానంద ప్రసాద్ మాట్లాడుతూ ప్రముఖ రంగస్థల, సినీనటుడు నాగభూషణంకు ఆయన విస్తృతంగా ప్రదర్శించిన రక్తకన్నీరు నాటకమే ఇంటి పేరైందని చెప్పారు. జీవితాంతం ప్రజానాట్యమండలి బలోపేతానికి నిర్విరామ కృషి చేశారని చెప్పారు. ఆత్రేయ నాటకాలైన భయం, పరివర్తన, కప్పలు నాటకాలను ఆంధ్ర దేశమంతటా ప్రదర్శించినట్టు తెలిపారు. వెయ్యి సినిమాల్లో నటించారని చెప్పారు. మాన్యం బదరీనాథ్ మౌనిక, లక్కరాజు లక్ష్మణరావు, తుంగా బాలస్వామి మాట్లాడారు.



మాట్లాడుతున్న లలితానంద ప్రసాద్

### పోలీసుల అదుపులో ఆటో దొంగ

తెనాలిరూరల్: ఆటో చోరీ చేసిన యువుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ టూ టౌన్ సర్కిల్ పరిధిలో ఓ ఆటో ఇటీవల చోరీకి గురైంది. ఆటో యజమాని పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడింది ఒంగోలుకు చెందిన యువకుడు నాగరాజుగా పోలీసులు గుర్తించి బుధవారం అదుపులోకి తీసుకున్నారు.